క్లుప్తంగా

రెడ్‌క్రాస్ దినోత్సవం

ప్రకాశం నగర్: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం రెడ్‌క్రాస్ స్థాపక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.రాఘవ కుమారి పర్యవేక్షణలో లాలాచెరువు స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాస్, సభ్యులు కె.వీరలక్ష్మి, శ్రీదేవి, కె.చిన్నిబాబు పాల్గొన్నారు.

పండ్ల పంపిణీ

ప్రకాశం నగర్: రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు సర్ హెన్రీ డ్యూనాండ్ జయంతి సందర్భంగా ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల జూనియర్ రెడ్‌క్రాస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.విజయకుమారి ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులు, బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.సుబ్రహ్మణ్యం, కృష్ణమోహన్, బి.సునీల్ కుమార్, జి.మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఆగి ఉన్న కారును ఢీ కొట్టిన లారీ

కొవ్వూరు: ఆగి ఉన్న కారును గ్యాస్ ట్యాంకర్ ఢీ కొట్టిన ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. కొవ్వూరు పట్టణ శివార్లలోని గామన్ ఇండియా బ్రిడ్జి సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదంలో రాజమహేంద్రవరంలోని తాడితోట ప్రాంతానికి చెందిన ఎం.కుమారి, ఆమె భర్త రమేష్, చెల్లెలు దేవి, వారి తల్లి గాయపడ్డారు. వివాహానికి హాజరయ్యేందుకు కుమారి, ఆమె కుటుంబ సభ్యులు కారులో రాజమహేంద్రవరం నుంచి బయల్దేరారు. గామన్ ఇండియా బ్రిడ్జి సమీపంలోకి వచ్చేసరికి కారులో ఆయిల్ అయిపోయింది. దీంతో కారును రోడ్డు పక్కనే ఆపి ఆయిల్ కోసం వెళ్లారు. ఈ సమయంలో ట్యాంకర్ లారీ కారుని ఢీకొట్టడంతో కారులో ఉన్న నలుగురూ గాయపడ్డారు. వారిని రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామని కొవ్వూరు పట్టణ ఎస్సై బి.దుర్గా ప్రసాద్ తెలపారు.

75వ సారి రక్తదానం



రక్తదానం చేస్తున్న కొవ్వూరి ధర్మారెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త, రెడ్‌క్రాస్ సభ్యుడు కొవ్వూరి ధర్మారెడ్డి 75వ సారి రక్తదానం చేశారు. సోమవారం స్థానిక జాంపేట ఉమా రామలింగేశ్వర కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని రక్తదానం చేశారు. తన 18వ ఏట నుంచే రక్తదానం చేయడం మొదలు పెట్టానని ధర్మారెడ్డి తెలిపారు.

స్పందనకు ఒక అర్జీ

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఒక అర్జీ వచ్చిందని మండల ప్రత్యేకాధికారి, డిప్యూటీ కలెక్టర్ గీతాంజలి తెలిపారు. తహసీల్దార్ పైడి చిన్నారావు, మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి సుబ్బారావు పాల్గొన్నారు.

కత్తితో పొడిచిన వ్యక్తికి ఐదేళ్ల జైలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): డబ్బులు ఇవ్వలేదని కత్తితో పొడిచి గాయపరిచిన నిందితుడికి ఐదేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. జరిమానా కట్టని ఎడల మరో ఆరునెలలు సాధారణ జైలు శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2020 అక్టోబరు 26న రాజమహేంద్రవరం స్వామి థియేటర్ సమీపంలోని పాన్‌షాపు వద్ద మొప్పడి రాధాకృష్ణ సిగరెట్ కాల్చుకుంటున్నాడు. అతడి వద్దకు రెల్లిపేటకు చెందిన కిలారి పాండురంగ సాయినాథ్ వచ్చి డబ్బులు అడిగాడు. అయితే లేవన్నాడన్న కోపంతో రాధాకృష్ణను సాయినాథ్ చాకుతో పొడిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి వన్‌టౌన్ ఎస్సై బి.రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం కేసు విచారణకు రావడంతో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.లక్ష్మణరావు సాక్షులను ప్రవేశపెట్టగా, ఫిర్యాది తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోడి సతీష్ నాయుడు వాదించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్‌జడ్జి ఎస్.పవన్ కుమార్ పైవిధంగా తీర్పునిచ్చారు.

క్రికెట్ టోర్నీ విజేత గాడాల

రంగంపేట: పెద్ద దొడ్డిగుంట గ్రామంలో గత 20 రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా సోమవారం ఆనూరు, గాడాల టీమ్‌ల మధ్య ఫైనల్ జరిగింది. ఈ ఫైనల్‌లో గాడాల టీమ్ విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన గాడాల టీమ్‌కు అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు కప్‌ను, విన్నర్ ప్రైజ్‌మనీ రూ.20 వేలను అందించారు. రన్నర్స్‌గా నిలిచిన ఆనూరు టీమ్‌కు రూ.10 వేలు అందించారు. ఈ టోర్నీని సత్య అకాడమీ డైరెక్టర్ కొండేపూడి సత్యనారాయణ స్పాన్సర్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కారి సంజీవరావు, ఎంపీటీసీ మడికి లక్ష్మి, సింగంపల్లి సొసైటీ డైరెక్టర్ కొండేపూడి వీర వెంకటరావు, మాజీ సర్పంచ్ మల్లెల వీర్రాఘవ, ఉప సర్పంచ్ పంట వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరం.. క్రీడాసంబరం

- శిక్షణ తరగతులు ప్రారంభం
- ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు





జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి శిక్షణ శిబిరానికి హాజరైన చిన్నారులు, షటిల్‌లో శిక్షణ ఇస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి



కడియంలో శిక్షణను ప్రారంభిస్తున్న ఎంఈవో లజపతిరాయ్

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని పిల్లలు వినియోగించుకుని, నైపుణ్యం పెంచుకోవాలని జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్ రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోమవారం నుంచి జూన్ ఆరో తేదీ వరకూ శిబిరం నిర్వహిస్తామన్నారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకూ, సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8 గంటల వరకు షటిల్, టెన్నిస్, క్రికెట్, వాలీబాల్, యోగాలో శిక్షణ ఇస్తామన్నారు. వీటిలో శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేకంగా పీఈటీ, కోచ్‌లను నియమించినట్టు తెలిపారు. శిబిరానికి వచ్చే పిల్లలకు ప్రతిరోజూ రాగి జావ, కోడిగుడ్డు, అరటిపండు ఇవ్వనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సీహెచ్ పాపారావు, అడిషనల్ ఎస్పీ (క్రైమ్స్), జి.వెంకటేశ్వరరావు, అడిషనల్ ఎస్పీ (ఏఆర్) డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కడియం: కడియంశాఖా గ్రంథాలయంలో వేసవి ఉచిత శిక్షణ తరగతులను మండల విద్యాశాఖాధికారి వి.లజపతిరాయ్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 35 రోజులు నిర్వహించే ఈ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రముఖ రచయిత దేవరపు నీలకంఠం మాస్టారు, గ్రంథాలయాధికారి శ్రీదేవి నిర్మల మాట్లాడారు. గొందేసి పూర్ణచంద్ర రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సమకూర్చిన స్వీట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హనుమంతరావు, వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు చిలుకూరి శ్రీనివాసరావు, భద్రరావు, నాగేశ్వరరావు, కృష్ణమూర్తి అబ్బులు పాల్గొన్నారు.

సీతంపేట గ్రంథాలయంలో..

ప్రకాశం నగర్: సీతంపేట గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులను ప్రారంభించారు. డీఐ దిలీప్‌కుమార్, మాతృశ్రీ విద్యాసంస్థల డైరెక్టర్ అరిగెల బాబు, చెక్క తాతారావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. గ్రంథాలయ అధికారి సుగుణ కుమారి మాట్లాడుతూ జూన్ 11 వరకు నిర్వహించే ఈ వేసవి తరగతుల్లో కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిష్, చిత్రలేఖనం, తెలుగు పద్యాలు, పాటలు, క్రాఫ్ట్ బొమ్మల తయారీలో శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణ మోహన్, పి.రాంబాబు, ఏబీ శర్మ పాల్గొన్నారు.

విజ్ఞానం పెంపొందించుకోవాలి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి సూచించారు. సోమవారం స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో రాజమహేంద్ర చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో వేసవి తరగతులు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి... సరస్వతీదేవి, గ్రంథాలయ పితామహుడు పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య విగ్రహాలకు పూలమాలలు వేశారు. గ్రంథాలయ అభివృద్ధికి రాజమహేంద్రి ట్రస్ట్ సభ్యులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ట్రస్ట్ అధ్యక్షుడు తెంటు సత్యనారాయణ మాట్లాడుతూ మానసిక వికాసానికి పుస్తక పఠనం ఎంతో దోహద పడుతుందన్నారు. 35 రోజుల పాటు నిర్వహించే ఈ శిబిరానికి వచ్చే విద్యార్థులకు ప్రతిరోజూ మజ్జిగ, స్నాక్స్ అందజేస్తామన్నారు. శ్రీ వెంకటేశ్వర రైస్‌స్టోర్స్ అధినేత తేతల వీరరాఘవరెడ్డి గ్రంథాలయం సౌండ్ సిస్టమ్ కోసం రూ.5 వేలు సహాయం అందించారు. ఇన్నీసుపేట కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కోళ్ల అచ్యుత రామారావు, ట్రస్టుసభ్యులు, లైబ్రేరియన్ పి.శ్రీదేవి పాల్గొన్నారు.

బీసీ సమస్యల పరిష్కారానికి పోరాటం

సీటీఆర్ఐ: బీసీ సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం చేయడంతో పాటు బీసీ మహిళా విభాగం పటిష్టతకు కృషి చేస్తానని జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుశీల మార్గాని చెప్పారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తనపై నమ్మకంతో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఈనెల 5న తనను ఈ పదవిలో నియమించారన్నారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించడానికి కృష్ణయ్య చేస్తున్న పోరాటానికి అందరూ కలిసి రావాలని కోరారు. బీసీ మహిళల్లో చైతన్యం తీసుకు వచ్చి వారి పురోభివృద్ధికి కృషి చేస్తామన్నారు. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లాకా వెంగళరావు, రాష్ట్ర ఇన్‌చార్జి యలగాల నూకానమ్మ, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు లద్దిక మల్లేష్, ఎంపీ మార్గాని భరత్ రామ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విలేకరుల సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం లీగల్ సెల్ రాష్ట్ర ఇన్‌చార్జి పిల్లి రమాదేవి, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కెల్ల శ్రీదేవి, సిటీ కన్వీనర్ పులవర్తి దేవిక, ఉపాధ్యక్షురాలు రత్నకుమారి, జిల్లా యూత్ అధ్యక్షుడు మేడిశెట్టి దుర్గ ప్రసాద్, జిల్లా మహిళా అధ్యక్షురాలు మేడిశెట్టి కనక మహాలక్ష్మి, నగర ప్రెసిడెంట్ ఆవల తులసి, సిటీ యూత్ ప్రెసిడెంట్ మార్గాని భాస్కర్, జిల్లా మహిళా ఉపాధ్యక్షులు నందిని పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి సీఎం జగన్ కృషి

- కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- వీరవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం



వీరవరంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

కడియం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని, నవరత్నాల పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తోందని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని వీరవరం గ్రామసచివాలయం–2 పరిధిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ శ్రేణులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లారు. సీఎం జగన్ పాలనలో అందిన లబ్ధిని వివరించడంతో పాటు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను చందన అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, డ్రైనేజీల సమస్యలను స్థానికులు వివరించగా, వెంటనే ఆయన సంబంధిత అధికారులను పిలిచి తక్షణమే పరిష్కరించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా వలంటీర్లు చూడాలని, ఏఒక్క లబ్ధిదారుడు నష్టపోకూడదన్నారు. వీరవరం గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయం–1 భవనాన్ని చందన నాగేశ్వర్ ప్రారంభించారు. అనంతరం వీరవరం చేనేత పరపతి సంఘాన్ని సందర్శించి అక్కడ వున్న పంచెలను పరిశీలించారు. కార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, గ్రామ పార్టీ నాయకులు బత్తుల రాము, రేమెళ్ల ప్రసాద్, రేమెళ్ల హరీష్, బత్తుల రాజబాబు, కొత్తపల్లి రాము, చిన్న వీర్రాజు, లంక కనకయ్య, మొక్కపాటి రాంబాబు, పెనుగొండ పోశయ్య, బచ్చు కృష్ణారావు, గుర్రపు సుబ్బారావు, ఇల్లపాటి వీరేంద్ర రాజు, చందన షణ్ముఖ, ఆదిమూలం సూర్యారావు, శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, కడియపులంక సొసైటీ అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీను, ఈలి గోపాలం, ఊటుకూరి శైలజ పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు అత్యంత ప్రాధాన్యం



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్‌డీఓ చైత్రవర్షిణి



కార్పొరేషన్ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ సత్యవేణి

సీటీఆర్ఐ: స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు రాజమహేంద్రవరం డివిజనల్ ఆర్‌డీఓ ఎ.చైత్రవర్షిణి ఆదేశించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో 14 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు అర్జీలను మండల స్థాయిలో తహసీల్దార్ కార్యాలయాల్లో, గ్రామ వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తొర్రేడు గ్రామానికి చెందిన నందికోట ధనలక్ష్మి ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకోగా, ఆర్డీఓ స్పందించి రూరల్ తహసీల్దార్‌కు పంపి, సమస్య పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోరుకొండకు చెందిన తాటికొండ అనంత మాణిక్య వరప్రసాద్ తమ భూములను నష్టపరిహారం మంజూరు చేయాలని అర్జీ అందజేశారు.

కార్పొరేషన్ కార్యాలయంలో..

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ పరిధిలో ప్రజల నుంచి వచ్చే స్పందన అర్జీలకు సత్వరమే పరిష్కారం చూపాలని నగరపాలకసంస్థ అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, ఇతర అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి ప్రజల నుంచి 11 ఫిర్యాదులు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ నగరపాలకసంస్థ పరిధిలో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు.

బడిఈడు పిల్లలు పాఠశాలల్లో ఉండాలి

ప్రకాశం నగర్: బడిఈడు బాలబాలికలు విధిగా పాఠశాలల్లో చదువుకోవాలని డీఎంహెచ్ స్కూల్ కాంప్లెక్స్ సీఆర్పీ జయంతి శాస్త్రి అన్నారు. విద్యాశాఖాధికారుల ఆదేశానుసారం పాఠశాలల ఆవాస ప్రాంతంలో బడిఈడు బాలబాలికల వివరాలు సేకరించి స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో నివేదిక సిద్ధం చేయాల్సి ఉన్నందున స్థానిక 14వ వార్డు సచివాలయంలో సోమవారం వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. విద్యాసంవత్సరం ప్రారంభం ముందే వార్డు ఆవాస ప్రాంతాల్లో బడిఈడు బాలబాలికల వివరాలను సేకరించాలన్నారు. వార్డులోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్పీలు, వలంటీర్ల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి అధికారులకు నివేదిక అందజేయాలన్నారు. పాఠశాల మధ్యలో మానివేసిన డ్రాప్‌ఔట్ విద్యార్థుల వివరాలను కూడా సేకరించాలన్నారు. సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ కార్యదర్శి పరస జగన్నాథరావు, సిమెంటరీ పేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత, సచివాలయ అడ్మిన్ కళాధర్ పాల్గొన్నారు.

ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదు

సీటీఆర్ఐ: తెలుగుదేశం పార్టీ వారిపై జగన్ ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. సెంట్రల్ జైల్లో ఉన్న మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు)ను సిటీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి భవాని, ఎంపీ రామ్మోహన్ నాయుడు, విశాఖ జిల్లా పార్లమెంట్ ఇన్‌చార్జి మతుకుమిల్లి భరత్ పరామర్శించారు. అనంతరం ఎంపీ రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ ఎవరూ ఫిర్యాదు చేయకుండానే ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి వాసుపై కేసులు పెట్టి అరెస్టు చేశారన్నారు. త్వరలోనే వారు బెయిల్‌పై బయటకు వస్తారని, వచ్చిన తరువాత గతంలో కంటే పది రెట్లు ఎక్కువగా పని చేస్తారని అన్నారు.

ఏబీవీపీ కార్యకర్తలపై కేసు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): తమ కళాశాల ఫర్నిచర్ ధ్వంసం చేయడంతో పాటు దురుసుగా వ్యవహరించాలని ఏబీవీపీ కార్యకర్తలపై శశి కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశం నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం ఏబీవీపీ కార్యకర్తలు సోమవారం జేఎన్‌రోడ్డులోని శశి కళాశాలలో ఇంటర్ తరగతులు నిర్వహించడంపై అభ్యంతరం తెలిపారు. వేసవి సెలవులు ఇచ్చిన తరగతులు ఎందుకు నిర్వహిస్తున్నారంటూ ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. ఆ తరుణంలో ఇరువర్గాల మధ్య ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. పరిస్థితి శృతిమించకుండా ప్రిన్సిపాల్ ప్రకాశం నగర్ స్టేషన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పోలీసులు పరిస్థితిని చక్కదిద్దారు. తమ కళాశాలలో ఇంటర్ సప్లిమెంటరీ విద్యార్థులకు మాత్రమే తరగతులు నిర్వహిస్తున్నామని ఏబీవీపీ కార్యకర్తలకు చెబుతున్నా కళాశాల ఫర్నీచర్ ధ్వంసం చేసి, దురుసుగా ప్రవర్తించారని కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశం నగర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఐదుగురు ఏబీవీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



వేసవి క్రికెట్ శిక్షణ శిబిరానికి హాజరైన విద్యార్థులు

రాజమహేంద్రవరం సిటీ: క్రికెట్‌లో జిల్లా వ్యాప్తంగా ఉత్తమ క్రీడాకారులను గుర్తించి ఎంపిక చేసేందుకు నెలరోజుల పాటు క్రికెట్ వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కోచ్ జీరి హరినాథ్ రెడ్డి తెలిపారు. సోమవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన శిబిరానికి జిల్లా వ్యాప్తంగా 120 మంది విద్యార్థులు హాజరయ్యారు. జూన్ 5వ తేదీ వరకు కొనసాగే ఈ కార్యక్రమంలో అండర్ 12 విభాగంలో 65 మంది, అండర్ 14 విభాగంలో 35 మంది, అండర్ 16 విభాగంలో 30 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకూ, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకూ రెండు విడతల్లో శిక్షణ అందజేస్తామని హరనాథ్ రెడ్డి తెలిపారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ బి.సత్యనారాయణ నేతృత్వంలో కొనసాగే ఈ శిబిరంలో రాజమహేంద్రవరం, కొవ్వూరు, కోరుకొండ, కడియం, ధవళేశ్వరం తదితర ప్రాంతాల నుంచి 120 మంది విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. బ్యాటింగ్, బౌలింగ్, వికెట్ కీపింగ్, రన్నింగ్‌తో పాటు ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పిస్తామన్నారు.

న్యాయవాదిపై దాడి అమానుషం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సత్యసాయి జిల్లా హిందూపురంలో అడ్వకేట్ కమిషన్‌పై పోలీసుల దాడికి నిరసనగా అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం గోకవరం బస్టాండ్ ససమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. న్యాయవాదులందరూ ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. వెల్ఫేర్ సొసైటీ స్టేట్ జనరల్ సెక్రటరీ ధర్నాలకోట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు, న్యాయవాదులు దర్బా సుజాత, బీర అరుణ్ కుమార్, బత్తుల రాజు, దారా ఆదిశేషు, కె.రాంప్రసాద్, పి.లావణ్య, ఎం.నాగేంద్ర పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పరుగులు



గడపగడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: రాష్ట్రంలో ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో దూసుకువెళ్లాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన అందిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని సంపత్‌నగరంలో సోమవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే.. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల యోగ క్షేమాలు తెలుసుకున్నారు. గడచిన నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలు ఏఏ కుటుంబానికి ఏమేరకు అందాయో వివరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ గ్రామంలో ఇంతవరకు రూ.5.5 కోట్లతో పలు అభివృద్ధి పనులు జరిగాయన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

అకాల వర్షాలతో ఇబ్బందులు పడుతున్న రైతులను కలుసుకుని ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం మీకు ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా భరోసానిచ్చారు. తడిసిన, మొలకలొచ్చి, రంగుమారిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేసేలా సీఎం జగన్ ఆదేశాలిచ్చారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంటగట్ల రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు లంక అమ్మిరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు మండారపు వీర్రాజు, గంగిశెట్టి సోమేశ్వర్రావు, లంక ఆదినారాయణ, మాచర్రావు, వెంకన్న, నాగేశ్వర్రావు పాల్గొన్నారు.